క్లుప్తంగా

ఈ-క్రాప్ తప్పనిసరి



పాల్తూరులో మిరప పంటను ఈ-క్రాప్ చేస్తున్న వ్యవసాయాధికారులు

విడపనకల్లు: పంటలు సాగు చేసిన రైతులు తప్పనిసరిగా ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి పెన్నయ్య సూచించారు. బుధవారం మండల పరిధిలోని పాల్తూరు, హావళిగి గ్రామాల్లో ఈ-క్రాప్ నమోదును పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. ఖరీఫ్‌లో మండల వ్యాప్తంగా వేరుశనగ ,ఆముదం, మిరప, కంది తదితర పంటలు 10,983 ఎకరాల్లో సాగైనట్లు తెలిపారు. ఇప్పటి వరకు 58 శాతం రైతులు మాత్రమే ఈ-క్రాప్ నమోదు చేయించుకున్నారన్నారు. ఈనెల 30వ తేదీలోపు పంటలు సాగు చేసిన ప్రతి రైతు ఈ-క్రాప్ చేయించుకోవాలని సూచించారు. ఈ-క్రాప్ నమోదు చేయించుకుంటేనే ప్రభుత్వం నుంచి లబ్ధి పొందేందుకు అర్హులవుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీఈఓ మెర్సీ, ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'పై సమీక్ష

కుందుర్పి: మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీడీఓ వెంకటనాయుడు అధ్యక్షతన అధికారులతో జగనన్న సురక్ష కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. ఆయా గ్రామ సచివాలయాల్లో వివిధ రకాల సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ఈనెల 20లోపు పరిష్కారం చూపాలన్నారు. సీజనల్ వ్యాధులపై హెల్త్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారిణి అనూష సూచించారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్ లక్ష్మీదేవి, ఏఓ మహేష్, ఇతర అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



మాట్లాడుతున్న మేజిస్ట్రేట్ దుర్గాకళ్యాణి

ఉరవకొండ: విడపనకల్లు మండలం ఉండబండ గ్రామంలో బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. లోకాయుక్త, ఉప లోకాయుక్త, ఎన్జీటీపై ఉరవకొండ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ దుర్గా కళ్యాణి వివరించారు. బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. ఆడపిల్లలకు చిన్న వయస్సులోనే పెళ్లి చేయకుండా చదివించాలన్నారు. చిన్నారులపై లైగింక దాడులకు సంబంధించి ఫోక్సో యాక్టు అమల్లో ఉంటుందని తెలిపారు. సివిల్, క్రిమినల్ కేసులు, ప్రామిసరీ నోట్లపై అవగాహన కల్పించారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

ఉరవకొండ: రాకెట్ల గ్రామంలో గురువారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పెన్నహోబిలం ఆలయ మాజీ చైర్మన్ అశోక్, గ్రామనేత దెయ్యాల నాగరాజు బుధవారం తెలిపారు. ఉదయం 9:30 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి హాజరవుతారన్నారు.

ఆర్టీసీ కార్మికుల సంబరాలు



సంబరాలు చేసుకుంటున్న ఆర్టీసీ ఉద్యోగులు

రాయదుర్గంటౌన్: ఎన్ఎంయూఏ (నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్)కు జీఓ ద్వారా గుర్తింపు ఇవ్వడంపై బుధవారం డిపో ఆవరణంలో ఆర్టీసీ ఉద్యోగులు సంబరాలు చేసుకున్నారు. ఆర్టీసీలో అత్యధిక సంఖ్యాబలం గల ఎన్ఎంయూఏకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గుర్తింపునివ్వడం పట్ల కృతజ్ఞతలు తెలియజేశారు. కేక్ కట్ చేసి బాణసంచా పేల్చి ఉద్యోగులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏపీపీటీడీ ఎన్ఎంయూఏ డిపో కార్యదర్శి హెచ్‌టీ స్వామి, రాష్ట్ర కార్యదర్శి నాగరాజు, జోనల్ జాయింట్ కార్యదర్శి నాగరాజు, డిపో అధ్యక్షుడు జిలాన్, గ్యారేజ్ అధ్యక్ష, కార్యదర్శులు సతీష్‌కుమార్, పీరా, సుబ్బరాయుడు, ప్రకాష్, దామోదర్, తిమ్మరాజు, జగదీష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ రవాణా అరికట్టాలి



మాట్లాడుతున్న సెబ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య

కంబదూరు: ఇసుక, మద్యం అక్రమ రవాణాను అరికట్టాలని సెబ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య సిబ్బందిని ఆదేశించారు. బుధవారం ఆయన స్థానిక సెబ్ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన రికార్డులను పరిశీలించి సెబ్ అడిషనల్ ఎస్పీ రామకృష్ణతో కలిసి సిబ్బందితో సమీక్షించారు. కర్ణాటక మద్యం, ఇసుక రవాణాపై నిరంతరం నిఘా ఉంచాలన్నారు. సెబ్ సీఐలు మొహిద్దీన్ బాషా, నర్సనాయుడు, నాగేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్: మద్యం అక్రమ రవాణను అరికట్టాలని సెబ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య సిబ్బందిని ఆదేశించారు. బుధవారం ఆయన పట్టణంలోని సబ్ స్టేషన్‌ను తనిఖీ చేసి సిబ్బందితో మాట్లాడారు. సెబ్ అడిషనల్ ఎస్పీ రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రబాబు దొంగ.. కాలవ గజదొంగ

- స్కాం చేయడంతోనే బాబు కటకటాల్లోకి
- గృహనిర్మాణ శాఖ మంత్రిగా పేదలకు కాలవ ఒరగబెట్టిందేం లేదు
- ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ధ్వజం



రాయదుర్గంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న విప్ కాపు రామచంద్రారెడ్డి



డీహీరేహాళ్‌లో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న లబ్ధిదారులు

రాయదుర్గం: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు దొంగ అయితే..ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాలవ శ్రీనివాసులు గజ దొంగ అని రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ధ్వజమెత్తారు. బుధవారం పట్టణంలోని శాంతి నగర్, డి హీరేహాళ్ మండల కేంద్రంలో కొత్తగా మంజూరైన పింఛన్ల పంపిణీ సొమ్మును రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పోరాళ్ల శిల్ప, మార్కెట్ యార్డ్ చైర్మన్ బోజరాజ్‌నాయక్, డి హీరేహాళ్ మండల కన్వీనర్ ఎం.వన్నూర్‌స్వామి, జిల్లా ఉపాధ్యక్షులు రాళ్ల తిమ్మారెడ్డితో కలసి ఆయన అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాల్లో విప్ కాపు మాట్లాడారు. ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో చంద్రబాబు రూ.371 కోట్లను దోపిడీ చేసి సీఐడీ అధికారులకు దొరికిపోయాడన్నారు. రాయదుర్గంలో మురికి 'కాలవ' టీడీపీ హయాంలో ఒక్క ఇసుక, నీరు-చెట్టులోనే రూ.వందల కోట్లు కొల్లగొట్టాడన్నారు. ఈ విషయం ఆనాడు తన మానస పుత్రికగా చెప్పుకునే ఈనాడులోనే అచ్చేశారన్నారు. రాష్ట్రానికి గృహ నిర్మాణ శాఖ మంత్రిగా ఉన్నా.. రాయదుర్గం ప్రజలకు ఏం ఒరగబెట్టారో సమాధానం చెప్పాలన్నారు. మహానేత వైఎస్సార్, ఆ తర్వాత సీఎం జగన్ పాలనలో మినహా టీడీపీ హయాంలో ఎక్కడైనా సెంటు స్థలం కొని పేదలకు ఇచ్చారా అంటూ నిలదీశారు. పేదల గురించి మాట్లాడే హక్కు ఈ మురికి 'కాలవ'కు లేదన్నారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్ పాలన సాగిస్తున్నారని పేర్కొన్నారు. నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపేలా గొప్ప సంస్కరణలకు శ్రీకారం చుట్టారన్నారు. వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులను ఇంటింటికీ పంపి పథకాలు అందేలా కృషి చేస్తున్నారన్నారు. మంచిచేసే ఈ ఉద్యోగులను చూస్తూ ఓర్వలేక కడుపుమంటతో టీడీపీ నేతలు రగలిపోతున్నారన్నారు. రాష్ట్రంలో అవ్వాతాతలు, వితంతువులు, దివ్యాంగులు, వివిధ రకాల చేతివృత్తులు, దీర్ఘకాల వ్యాధిగ్రస్తులకు ఇచ్చే పింఛన్ల పంపిణీలోనూ రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త రికార్డు సృష్టించిందన్నారు. కొత్తగా 1.93 లక్షల మందికి అందిస్తున్నారంటే ప్రభుత్వ తీరును గుర్తించాలన్నారు. ఊపిరి ఉన్నంత వరకు రాయదుర్గం ప్రజలకు సేవ చేయాలన్నదే తన లక్ష్యమని విప్ కాపు స్పష్టం చేశారు. రాజకీయ లబ్ధి కోసం చంద్రబాబు, కాలవ తనపై తప్పుడు ఆరోపణలు చేశారని ఆరోపించారు. కాపు రామచంద్రారెడ్డి తప్పు చేయాల్సి వస్తే ఆ రోజే ప్రాణం తీసుకుంటాడని దైవసాక్షిగా ప్రమాణం చేశారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డ్ చైర్మన్ బోజరాజ్‌నాయక్, మున్సిపల్ వైస్ చైర్మన్లు శ్రీనివాస్‌యాదవ్, వలీబాష, పార్టీ నాయకులు అరవ శివప్ప, వార్డు కౌన్సిలర్లు, ఇన్‌చార్జులు, డి హీరేహాళ్ జెడ్పీటీసీ హసీనబాను, మండల కన్వీనర్ ఎమ్ వన్నూర్‌స్వామి, సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు

కణేకల్లు: సీఎం జగన్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు పేద, నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపి సరికొత్త జీవితాన్ని ప్రసాదించాయని రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని యర్రగుంట గ్రామంలో బుధవారం 'గడప గడపకూ' మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. మార్కెట్‌యార్డు మాజీ వైస్ చైర్మన్ యంద్రకాయల వన్నూరప్ప, వైఎస్సార్‌సీపీ నాయకులు కెనిగుంట రామిరెడ్డితోపాటు అధికారులు, వలంటీర్లతో కలిసి విప్ కాపు గ్రామంలో విస్తృతంగా పర్యటించారు. ప్రతి ఇంటికీ వెళ్లి నాలుగున్నరేళ్ల కాలంలో ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకాలను వివరించి బ్రోచర్లను లబ్ధిదారులకు ఇచ్చారు. ఈ సందర్భంగా విప్ కాపు మాట్లాడుతూ పేదల కోసం జగనన్న కన్నా ఎక్కువగా ఎవరూ ఆలోచించరన్నారు. అధికారంలో ఉండి మేలు ఎవరు చేశారో? మోసం ఎవరూ చేశారో ఒక్క సారి ఆలోచించుకోవాలన్నారు. అర్హత ఉన్నోళ్లకు సంక్షేమ పథకాలు కచ్చితంగా అందించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆలూరు చిక్కణ్ణ, పట్టణ కన్వీనర్ టీ.కేశవరెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షులు పైనేటి తిమ్మప్పచౌదరి, మాజీ అధ్యక్షులు మారెంపల్లి మారెన్న, మండల జేసీఏ కన్వీనర్ హనుమంతరావు, యర్రగుంట వైస్ సర్పంచు సునీతమ్మ, ఎంపీటీసీ నాగరాజు, మాజీ సర్పంచు భీమప్ప, నాయకులు గొల్ల భీమిరెడ్డి, గౌని శ్రీనివాసరెడ్డి, పీ.శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

3 నుంచి 'జగనన్న ఆరోగ్య సురక్ష' శిబిరాలు



మాట్లాడుతున్న మండల వైద్యాధికారి లక్ష్మీనారాయణ

కూడేరు: ప్రజారోగ్యాన్ని కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్షను విజయవంతం చేద్దామని ఎంపీడీఓ ఎంకే బాషా, మండల వైద్యాధికారి లక్ష్మీనారాయణ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో జగనన్న ఆరోగ్య సురక్షపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అక్టోబర్ 3 నుంచి సచివాలయాల పరిధిలో వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. అంతలోపు ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, వలంటీర్లు ఇంటింటా తిరిగి ప్రజలకు ఆరోగ్య సమ్యలు ఉంటే గుర్తించాలని తెలిపారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి వైద్య సేవలు అందించడం జరుగుతుందన్నారు. సర్వేను పక్కాగా చేపట్టాలని సూచించారు. సమావేశంలో సీహెచ్ఓ వరలక్ష్మి, సూపర్‌వైజర్ రవీంద్ర, ఎంఎల్‌హెచ్‌పీలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజేశ్వరి పాల్గొన్నారు.

పంటల పరిశీలన

వజ్రకరూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో బుధవారం నియోజకవర్గ హార్టికల్చర్ అధికారి నెట్టికంటయ్య పర్యటించారు. కమలపాడు వద్ద రైతులు సాగు చేసిన చీనీ, బొప్పాయి, అంజూర తదితర పంటలను పరిశీలించారు. పండ్ల తోటల పెంపకానికి ప్రభుత్వం ప్రోత్సహకాలు అందిస్తున్నట్లు వెల్లడించారు.

పండుగలా కొత్త పింఛన్ల పంపిణీ



ఉరవకొండ: ఆమిద్యాలలో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం



ఎర్రగుంటలో పింఛన్లు పంపిణీ చేస్తున్న సింగిల్ విండో అధ్యక్షుడు వన్నూర్‌రెడ్డి



కొత్తగా మంజూరైన పింఛన్ లబ్ధిదారులతో వైఎస్సార్‌సీపీ నాయకులు

ఉరవకొండ: ఆమిద్యాల గ్రామంలో బుధవారం నూతన పింఛన్ల పంపిణీ కార్యక్రమం పండుగలా జరిగింది. ఆమిద్యాల పీఏసీఎస్ చైర్మన్ తేజోనాథ్, సర్పంచ్ శ్రీరాములు, పెన్నహోబిలం ఆలయ మాజీ చైర్మన్ అశోక్ 52 మంది లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము అందజేశారు. అనంతరం సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చిత్రపటానికి లబ్ధిదారులతో కలిసి నాయకులు క్షీరాభిషేకం నిర్వహించారు. ఎంపీటీసీలు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

416 నూతన పింఛన్ల మంజూరు

విడపనకల్లు: పాల్తూరు, హావళిగి, కరకముక్కల, గడేకల్లు, పాల్తూరు, పొలికి, డొనేకల్లు, హంచనహాల్‌లో బుధవారం ఎంపీపీ కరణం పుష్పావతి, ఎంపీడీఓ శ్రీనివాసులు, భీంరెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా నాయకులు సుంకన్న, గాజుల చిన్న వెంకటేశులు దాదాపు 416 మందికి పింఛన్ సొమ్ము అందజేశారు. ఎంపీడీఓ కార్యాలయంలో సీఎం జగన్ చిత్రపటానికి లబ్ధిదారులు క్షీరాభిషేకం చేశారు.

175 పింఛన్ల మంజూరు

కూడేరు: మండలానికి కొత్తగా 175 పింఛన్లు మంజూరైనట్లు ఎంపీడీఓ ఎంకే బాషా బుధవారం తెలిపారు.వీరందరికీ నగదు పంపిణీ చేస్తున్నామన్నారు.

మండలంలో 203 కొత్త పింఛన్లు

రాయదుర్గం రూరల్: మండలంలోని 14 సచివాలయాల పరిధిలో 203 కొత్త పింఛన్లు మంజూరైనట్లు ఎంపీడీఓ కొండయ్య బుధవారం తెలిపారు. 74 ఉడేగోళం సచివాలయ పరిధిలో 28, ఆవులదట్ల 08, బీఎన్ హళ్లి 21, బొందనకల్లు 21, చదం గొల్లలదొడ్డి 04 , డి.కొండాపురం 17, జుంజురాంపల్లి 18, మల్లాపురం 07, మెచ్చిరి 13, నాగిరెడ్డిపల్లి 07, పల్లేపల్లి 12, టి.వీరాపురం 12, వడ్రహొన్నూరు14 , వేపరాల సచివాలయ పరిధిలో 21 కొత్త పింఛన్లు మంజూరైనట్లు ఆయన తెలిపారు.

- కులమతాలు, పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి అన్నారు. మండలంలోని 74 ఉడేగోళం సచివాలయ పరిధిలో సర్పంచ్ దురుగమ్మ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొత్త పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఉపసర్పంచ్ రామకృష్ణారెడ్డి, మద్దానేశ్వర స్వామి ఆలయ ధర్మకర్త బసవరాజు, కూల్‌డ్రింక్ అప్పాజి, మాజీ జెడ్పీటీసీ గోవిందప్ప, ఉలుగప్ప పాల్గొన్నారు. డి.కొండాపురం గ్రామంలో కొత్త పింఛన్లను సర్పంచ్ సుధాకర్, ఎంపీటీసీ శివప్ప, రామన్న పంపిణీ చేశారు.

నిస్సహాయులకు జగనన్న ప్రభుత్వం అండ

కుందుర్పి: వైఎస్సార్ పింఛన్ కానుక పథకం ద్వారా జగనన్న ప్రభుత్వం నిస్సహాయులకు అండగా నిలుస్తోందని వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ పాలాక్షి, ఎంపీపీ కమలమ్మ, సింగిల్ విండో అధ్యక్షుడు వన్నూర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం జంబుగుంపల, ఎర్రగుంట, తూముకుంట తదితర పంచాయతీల్లో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు కొత్త లబ్ధిదారులకు పింఛన్ల సొమ్ము పంపిణీ చేశారు. మండలంలోని 13 గ్రామ పంచాయతీలకు గాను సెప్టెంబర్‌లో 471 పింఛన్లు మంజూరైనట్లు ఎంపీడీఓ వెంకటనాయుడు తెలిపారు. ఆయా గ్రామాల సర్పంచులు గంగాధర్, విశాలాక్షి, నాయకులు తిమ్మరాజు, అంజి, ఎంపీటీసీ ఓంకేష్ తదితరులు ఉన్నారు.

బొమ్మనహాళ్: మండలంలోని నేమకల్లు, బొమ్మనహాళ్, గోవిందవాడ గ్రామాల్లో నూతనంగా మంజూరైన పింఛన్లను బుధవారం స్థానిక మండల వైఎస్సార్‌సీపీ నాయకులు లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులందరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందిస్తోందని తెలిపారు. నేమకల్లులో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు పరమేశ్వర, వన్నూరుస్వామి, నాయకులు లోకేష్, యువరాజ్‌స్వామి, ఫోటో బసవరాజు, బుజ్జి, తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.

వజ్రకరూరు: మండల కేంద్రంలోని స్త్రీశక్తి భవనం, గడేహోతూరు, తట్రకల్లు, పీసీ ప్యాపిలి, వెంకటాంపల్లిపెద్దతండా తదితర గ్రామాల్లో బుధవారం నూతన పింఛన్లను ప్రజాప్రతినిధులు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతరం సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేపట్టారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి గుండ్లపల్లిప్రసాద్ రెడ్డి, వజ్రకరూరు సర్పంచు మోనాలీసా, ఎంపీటీసీ ఫిరోజ్‌బాను, సచివాలయ కన్వీనర్లు ఉస్మాన్, రాకెట్ల బాబు, ఎంపీడీఓ విజయలలిత, గ్రామ కార్యదర్శి శ్రీధర్‌బాబు, ఎంపీపీ రమావత్ దేవి, సర్పంచ్ కొర్రా శివాజీనాయక్, ఎంపీటీసీ రామకృష్ణ, బీసీ సెల్ జిల్లా కార్యదర్శి వీరభద్రగౌడ్, వైస్ ఎంపీపీ సుంకమ్మ, సర్పంచ్ జ్యోతిబాయి, మాజీ ఎంపీపీ తిప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

శెట్టూరు: అర్హతే ప్రామాణికంగా వైఎస్సార్ పింఛన్ కానుక అందిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మాజీ మండల కన్వీనర్ సోమనాథ రెడ్డి అన్నారు. బుధవారం శెట్టూరు, చెర్లోపల్లిలో కొత్త లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చెవుల కిష్టప్ప, నాయకులు పోస్ట్ రామకృష్ణ, హరినాథరెడ్డి, రామాంజనేయులు, గోవిందు పాల్గొన్నారు.

బెళుగుప్ప: మండల పరిధిల్లో పలు గ్రామాల్లో బుధవారం కొత్తగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో బెళుగుప్ప సహకార సంఘం అధ్యక్షుడు శివలింగప్ప, పార్టీ మండల కన్వీనర్, అగ్రీబోర్డు చైర్మన్ శ్రీనివాసులు, సర్పంచ్ రామిరెడ్డి, మాజీ సర్పంచ్ భాస్కర్‌రెడ్డి ఎంపీడీఓ రామచంద్ర, గ్రామ సచివాలయ కన్వీనర్ కరుణాకర్, ఉప సర్పంచ్ పాతన్న పాల్గొన్నారు.

కంబదూరు: రాళ్లఅనంతపురం, కదిరిదేవరపల్లి కొత్త పింఛన్ లబ్ధిదారులకు బుధవారం వైఎస్సార్‌సీపీ నాయకులు పింఛన్ సొమ్ము పంపిణీ చేశారు. వైస్ ఎంపీపీ బీమేష్, సర్పంచ్ అమర్, వైఎస్సార్‌సీపీ యువజన నేత హనుమంతరాయుడు తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే సీఎం లక్ష్యం



మాట్లాడుతున్న రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీ చరణ్

కళ్యాణదుర్గం రూరల్: మహిళా సాధికారతే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని స్త్రీ, శిశు సంక్షేమ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ పేర్కొన్నారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని రాచప్పవీధి 19 వార్డులో డ్వాక్రా మహిళలతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. మంత్రి డ్వాక్రా మహిళలతో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహిళా సాధికారత కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నారన్నారు. మహిళల భద్రత కోసం దిశ యాప్ తీసుకొచ్చారన్నారు. ఎన్నికల హామీ మేరకు వైఎస్సార్ కింద డ్వాక్రా రుణాలు మాఫీ చేశారన్నారు. ఏటా సున్నావడ్డీ కింద మొత్తాన్ని మహిళా సంఘాలకు వర్తింపజేస్తున్నారన్నారు. వైఎస్సార్ చేయూత కింద ఏటా రూ.18,750 చొప్పున మహిళ ఖాతాల్లో జమ చేస్తున్నారన్నారు. ఇంటి పట్టాలు కూడా మహిళల పేరు మీద మంజూరు చేస్తున్నారన్నారు. అమ్మఒడి, జగనన్న వసతిదీవెన, విద్యాదీవెన లాంటి పథకాలన్నీ మహిళలకే వర్తింపజేస్తున్నారని గుర్తు చేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ జయం ఫణి, వార్డు కౌన్సిలర్ భాగ్యమ్మ, జేసీఎస్ పట్టణ కన్వీనర్ అర్చన, డీలర్లు జోసెఫ్, నాయకులు నాగలక్ష్మి, బాలసోము, షేక్షా, జాకీర్, మహబూబ్ ఖాన్, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

సామూహిక గృహ ప్రవేశాలకు ఏర్పాట్లు చేయండి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ

ఉరవకొండ: మరో వారం రోజుల్లోపు జగనన్న లేఅవుట్‌లలో పూర్తయిన ఇళ్లను సామూహిక గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక 1వ సచివాలయంలో ఎంపీడీఓ అమృతరాజ్, హౌసింగ్ డీఈఈ వరప్రసాద్, సర్పంచ్ లలితమ్మ, ఉప సర్పంచ్ వన్నప్పలతో కలసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఉరవకొండలోని కొలిమి జగనన్న లేఅవుట్‌ను సామూహిక గృహ ప్రవేశాలకు ఎంపిక చేశామన్నారు. ఈ లేఅవుట్‌లో 455 ఇళ్లు మంజూరైనట్లు తెలిపారు. ఇందులో 107 ఇళ్లు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా సామూహిక గృహప్రవేశాల కార్యక్రమం చేపట్టగానే నియోజకవర్గంలో ప్రతి చోట జిల్లా ఉన్నతాధికారుల చేతులమీదుగా కార్యక్రమం ప్రారంభం అవుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ మీరంబాషా, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ఫామీదా, విద్యుత్ శాఖ ఏఈ గురుమూర్తి ఈఓ రమణలు పాల్గొన్నారు.

వంద్రప్ప మృతి తీరని లోటు



నివాళులర్పిస్తున్న కాపు భారతి

బొమ్మనహాళ్: దర్గాహొన్నూరు వైఎస్సార్‌సీపీ నాయకుడు పూజారి వంద్రప్ప మృతి పార్టీకి తీరని లోటని రెడ్‌క్రాస్ సొసైటీ చైర్‌పర్సన్ కాపు భారతి అన్నారు. బుధవారం పూజారి వంద్రప్ప అనారోగ్యంతో దర్గాహొన్నూరులో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కాపు భారతి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఈశ్వరరెడ్డి, సీనియర్ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, వన్నల్లి రామంజినేయులు, లోకేష్, మాబుసాబ్, రామకృష్ణ, కందేపల్లి రమేష్, ఎంపీహెచ్ రాజ్‌కుమార్ తదితరులు మృతదేహంపై పూలమాల వేసి నివాళ్ళరించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

సంక్షిప్త సమాచారం

జంబుగుంపల, అపిలేపల్లిలో రీసర్వే

కుందుర్పి: వచ్చే వారం నుంచి జంబుగుంపల, అపిలేపల్లిలో వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు- భూరక్ష కింద రీసర్వే చేపడుతున్నట్లు తహసీల్దార్ విజయలక్ష్మి పేర్కొన్నారు. బుధవారం అపిలేపల్లిలో సర్పంచ్ అతావుల్లా అధ్యక్షతన భూసర్వేపై గ్రామసభ నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రైతుల భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం రీసర్వే చేపడుతోందన్నారు. డీటీలు తిప్పేస్వామి, కుళ్లాయప్ప, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సంపూర్ణ పోషణతో ఆరోగ్యం

బొమ్మనహాళ్: 'వైఎస్సార్ సంపూర్ణ పోషణ' పథకం మహిళలకు వరంలా మారిందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శాంతకుమారి తెలిపారు. బుధవారం మండలంలోని ఉద్దేహాళ్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం కిట్లను అందజేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం పంపిణీ చేస్తున్న నిత్యావసర సరుకులను సక్రమంగా వినియోగించుకుని ఆరోగ్యం మెరుగుపరుచుకోవాలన్నారు. ఆరు నెలల నుంచి మూడు సంవత్సరాల పిల్లలకు బాలామృతం కిట్లను అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు కృష్ణవేణి, లక్ష్మి, ఏఎస్ఎం జైనాభి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ ఆరోగ్య సేవలు

బెళుగుప్ప: సచివాలయ పరిధిలోని ప్రతి కుటుంబానికి ఆరోగ్య సేవలు అందించేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, మండల ప్రత్యేకాధికారి శంకరయ్య పేర్కొన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల వైద్యాధికారి కార్తీక్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎంపీపీ పెద్దన్న అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్షపై సమావేశం నిర్వహించారు. ఈనెల 15 నుంచి ఆరోగ్య సర్వే చేపట్టడం జరుగుతున్నారు. 30వ తేదీ నుంచి 12 సచివాలయాల పరిధిలో హెల్త్ క్యాంపులు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో మండల అగ్రి బోర్డు చైర్మన్ శ్రీనివాస్, వైద్యాధికారులు ప్రియాంక, లోకేష్, తహసీల్దార్ ఓబులేసు, ఎంపీడీఓ రామచంద్ర, ఎంఈఓ మల్లారెడ్డి, హౌసింగ్ ఏఈ శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువకుడి మృతి



వెంకటేశులు (ఫైల్)

బొమ్మనహాళ్: మండలంలోని ఉంతకల్లు గ్రామానికి చెందిన వెంకటేశులు (21) అనే యువకుడు బళ్లారి విమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. బొమ్మనహాళ్ ఎస్‌హెచ్ఓ హనుమంతనాయక్ తెలిపిన మేరకు.. గ్రామానికి చెందిన వెంకటేశులుకు ఉరవకొండ మండలం ముత్తురు గ్రామానికి చెందిన శ్యామలతో ఏడాది క్రితం వివాహం అయ్యింది. వెంకటేశులుకు మద్యం తాగుడు అలవాటు ఉండేది. రెండు రోజుల క్రితం ఆత్మకూరులో బంధువుల వివాహం ఉండటంతో భార్యాభర్తలు కలిసి వెళ్లారు. అక్కడ మద్యం తాగి విచిత్రంగా ప్రవర్తించడంతో భార్య మందలించినట్లు తెలిపారు. ఇంటికి వచ్చిన తర్వాత కూడా తల్లిదండ్రులు మందలించడంతో మంగళవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో గడ్డి మందు తాగాడు. దీంతో కుటుంబ సభ్యులు బళ్లారి విమ్స్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు తెలిపారు. భార్య శ్యామల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిర్వహించి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

తప్పులు లేని ఓటరు జాబితా

రాయదుర్గం రూరల్: ఓటరు జాబితా సవరణలో భాగంగా బీఎల్ఓలు చేపట్టిన ఇంటింటా సర్వేకు రాజకీయ పార్టీ బూత్‌లెవెల్ పోలింగ్ ఏజెంట్లు సహకరించి తప్పులు లేని ఓటరు జాబితా రూపకల్పనకు సహకరించాలని తహసీల్దార్ మారుతి అన్నారు. స్థానిక తన చాంబర్‌లో బుధవారం రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు వైజాగ్ రవి, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు మల్లికార్జున, తదితరులున్నారు.

సక్రమంగా పౌష్టికాహారం పంపిణీ చేయండి

కంబదూరు: అంగన్‌వాడీ కేంద్రాల్లో లబ్ధిదారులకు పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ చేయాలని సీడీపీఓ వనుజా అక్కమ్మ, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ముత్యాలరెడ్డి సిబ్బందికి సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో కంబదూరు ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణలో సమయపాలన తప్పనిసరిగా పాటించాలన్నారు. అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు రాధ, సుశీల, జ్యోతిలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రూ.13 లక్షలతో సీసీ రోడ్డు పనులు

వజ్రకరూరు: మండలంలోని వెంకటాంపల్లిపెద్ద తండా (రూపానాయక్ తండా)లో బుధవారం రూ.13 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ రమావత్‌దేవి, పీఏసీఎస్ చైర్మన్ సుధీర్ రెడ్డి, సర్పంచ్ కొర్రా శివాజీ నాయక్, మాజీ సర్పంచ్ వైద్యనాథ రెడ్డి, ఎస్టీ సెల్ జిల్లా కార్యదర్శి సామానాయక్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గంధం ఊరేగింపు

వజ్రకరూరు: మండల కేంద్రంలో బుధవారం సాయంత్రం హజరత్‌సయ్యద్ మూరాద్‌షావలి 386వ ఉరుసు వేడుకలు ప్రారంభమయ్యాయి. స్థానిక చిన్న ఆసారు మందిరం నుంచి స్వామి దర్గా వరకూ గంధాన్ని ఊరేగించారు. భక్తులు స్వామికి చక్కెర సమర్పించారు. గురువారం ఉరుసు జరుగుతుందని గ్రామస్తులు తెలిపారు.

ప్రజల ముంగిటకే వైద్య సేవలు

కూడేరు: వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లతో ప్రజల ముంగిటకే వైద్య సేవలందుతున్నాయని సీహెచ్ఓ జయ తెలిపారు. బుధవారం మండల పరిధిలోని కమ్మూరులో వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లో అందించే వైద్య సేవలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సీహెచ్ఓ జయ మాట్లాడుతూ.. విలేజ్ క్లినిక్‌లో సుమారు 12 రకాల వైద్య సేవలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చిన్న రంగారెడ్డి, ఏఎన్ఎం మాధవి, ఆశావర్కర్లు శ్రీదేవి, ఆదెమ్మ, చంద్రకళ, మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.

రైతు ఉత్పత్తిదారుల సంఘం భవనం ప్రారంభం

గుమ్మఘట్ట: తమది రైతు సంక్షేమ ప్రభుత్వమని ప్రభుత్వ విప్ కాపురామచంద్రారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కోనాపురం గ్రామంలో రూ.15,00,000 నిధులతో నిర్మించిన రైతు ఉత్పత్తిదారుల సంఘం భవనాన్ని బుధవారం ప్రారంభోత్సవం చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా రైతులను అన్ని రకాలుగా ఆదుకునేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కృషిచేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ భవాని, జెడ్పీటీసీ సభ్యుడు పి.ఎస్.మహేష్, రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి, రైతు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షులు నాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ గ్రీవెన్స్ సెల్ జిల్లా అధ్యక్షుడు గౌని కాంతారెడ్డి, కాంట్రాక్టర్ కొత్తపల్లి సత్యనారాయణ రెడ్డి, వైకేపి ఏసీ గంగాధర్, ఎంపీటీసీలు, సర్పంచులు రమేష్, ఉమేష్, ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి బీటీపీ గోవిందు, నాయకులు లక్ష్మిరెడ్డి, కేఎం రాజు, బేలోడు రామాంజినేయులు, నారాయణ రెడ్డి, హరినాథ్ రెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ సుధాకర్ రెడ్డి, పల్లకిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.